# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 21-7-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:277 పేజీలు:6 వెల: రూ.1/-


## రాష్ట్రంలో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జులై 20 : రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లాల అధికారులను ఆదేశించారు. అవసరమైతే రెవెన్యూ విభాగంలో అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని ఆదేశాలు వెల్లడించారు.

భారీ వర్షాల వల్ల జనజీవనానికి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణను ఆదేశించారు. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గోదావరి ఉధృతి, వరద పరిస్థితులపై ఆయా జిల్లా కలెక్టర్లతో టెలిఫోన్ లో మాట్లాడి అక్కడి పరిస్థితులను సమీక్షించారు.

తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న గోదావరి ఉధృతి క్రమక్రమంగా పెరుగుతుండడంపై గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. వరద ముప్పు ప్రాంతాలలో సహాయక చర్యలు మరింత ముమ్మరం చేయాలని తెలిపారు.

### చురక

సాఫ్టువేర్ అప్ డేట్లో
చెలరేగిన క్షణం ఎర్రర్
సకల విశ్వ కల్లోలం
సృష్టించిన ఒక టెర్రర్.

వికటిస్తే పరిశోధన
విజ్ఞానపు జ్వలితం
తట్టుకోక ఎప్పుడైనా
తప్పుతుందా ఫలితం



-వేల్పుల నారాయణ
9440433475

# ఆర్టీసీ హాస్పటల్‌లో కొత్త విభాగాలను ప్రారంభించిన మంత్రి పొన్నం




హైదరాబాద్, జులై 20 : తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ స్కాన్, ఎంఆర్ఐ ఆధునిక వైద్య పరీక్షా కేంద్రాలతో పాటు ఫిజియోథెరఫీ యూనిట్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఫార్మసీని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ నేడు ప్రారంభించారు.

అనంతరం తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. చికిత్స కోసం వచ్చిన ఆర్టీసీ సిబ్బందితో ఆయన ముచ్చటించారు. ఈ కార్యక్రమాల్లో టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆ తర్వాత తార్నక ఆర్టీసీ ఆస్పత్రిలో వైద్యులతో పొన్నం సమావేశమయ్యారు. సిబ్బందికి అందిస్తోన్న వైద్య సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అంతకముందు ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కను నాటారు.

# కర్నాటకలో భారీ వర్షాలు

**– శ్రీశైలం జలాశయానికి భారీగా వచ్చి చేరుతున్న వరద నీరు**

**– శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి నీటిని వదిలిన అధికారులు**

హైదరాబాద్ జూలై 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్): కర్నాటకలో భారీ వర్షాలు కురుస్తుండడంతో కృష్ణా నదిలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీ వరద నీరు చేరుతోంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి నీటిని అధికారులు వదిలారు. జూరాల రిజర్వాయర్ నుంచి స్పిల్ వే ద్వారా 19,615 వేల క్యూసెక్కులు, జల విద్యుత్ ద్వారా 37వేల 250 క్యూసెక్కుల చొప్పున 56, 865 క్యూసెక్కుల నీటిని దిగువకు అధికారులు వదిలారు. తెలంగాణలో గత రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఆదిలాబాద్, కుమ్రంబీం ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఇన్ ఫ్లో : 70,000 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో : 56,865 క్యూసెక్కులు, పూర్తిస్థాయి నీటి సామర్థ్యం: 318.516 మీటర్లు, ప్రస్తుత నీటి సామర్థ్యం: 317.420 మీటర్లు, పూరిస్థాయి నీటి నిల్వ: 9.657 టిఎంసి, ప్రస్తుత నీటి నిల్వ : 7.498 టిఎంసి ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాలలో 10 యూనిట్లలో 395 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# మూసీ ప్రక్షాళనతో విశ్వనగరానికి మరింత శోభ- రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జులై 20 : మురికికూపంగా మారిన మూసీని సుందరీకరణ చేయడంతో పాటు హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్ నగర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు విపత్తుల నిర్వహణకు హైడ్రా (ఊజఆఖీం) అనే సరికొత్త వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

గోపన్‌పల్లిలో కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి నేడు ప్రారంభించారు. అనంతరం జెండా ఊపి ఉమెన్ బైకర్స్‌ను అనుమతించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ ఫ్లైఓవర్ ద్వారా శేరిలింగంపల్లి అభివృద్ధి చెందుతుందని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందుకోసం త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేసి లక్షా 50 వేల కోట్లతో పనులకు శ్రీకారం చుడతామని వివరించారు. రానున్న ఐదేళ్లలో ప్రపంచ నలుమూలలు పర్యాటకులు సందర్శించేలా మూసీ అభివృద్ధికి సంపూర్ణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మూసీని చూడగానే ప్రజాప్రభుత్వం గుర్తొచ్చేలా తీర్చిదిద్దుతామని చెప్పారు.

# అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్..: సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్, జులై 20 : రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా సివిల్స్ ప్రిలిమ్స్‌లో పాసైన రాష్ట్ర అభ్యర్థులకు సింగరేణి సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందించనున్నారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్రానికి చెందిన 41 మంది అభ్యర్థులతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియామకాల కోసమే తెలంగాణ పోరాటం జరిగిందన్నారు. త్యాగాల పునాదులపై తెలంగాణ ఏర్పడిందని చెప్పారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని చెప్పారు.

అందుకే అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు.

యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని మార్పులు చేశామన్నారు. గ్రూప్స్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామని, ప్రస్తుత డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిరుద్యోగుల ఇబ్బందులను గుర్తించి గ్రూప్–2 పరీక్ష వాయిదా వేశామని చెప్పారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని వెల్లడించారు. పకడ్బందీ ప్రణాళికతో పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ప్రవేశపెడుతామన్నారు. ఇక ప్రతీ ఏటా మార్చి నెలలోగా అన్ని శాఖల్లో ఖాళీల వివరాలు తెప్పించుకుంటామని చెప్పారు. జూన్ 2లోగా నోటిఫికేషన్ వేసి డిసెంబర్ 9లోగా నియామక ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మంచి కార్యక్రమాన్ని చేపట్టిన సింగరేణి సంస్థను అభినందించారు. మెయిన్స్‌కు సన్నద్ధం కావడానికి ప్రభుత్వం పక్షాన ఆర్థిక సాయం అందించడం రాష్ట్ర చరిత్రలోనే ఇదే మొదటిసారని చెప్పారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమని, అంతా మెయిన్స్‌కు ఎంపిక కావాలని అభ్యర్థులకు సూచించారు.

# దేశ ఆర్థిక ప్రగతికి మూలం ఖనిజ సంపద!

**–కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్, జులై 20 : మైనింగ్ అండ్ మినరల్ దేశానికి ఆర్థిక మూల స్తంభాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బేగంపేటలో నేడు జరిగిన మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్ షో లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2027 లోపే భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతోందన్నారు. 70 ఏళ్లు దాటిన ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉన్నామని తెలిపారు. 2047 వరకు దేశ అభివృద్ధి చెందిన దేశంగా చేయాలని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు.

దేశం ఆత్మ నిర్భర భారత్ ఎదగాలంటే మైనింగ్స్ అండ్ మినరల్స్ భాగస్వామ్యం ఉండాలన్నారు. మైనింగ్ అండ్ మినరల్ దేశానికి ఆర్థిక మూల స్తంభాలన్నారు. ప్రపంచానికి జింక్ ను అందించింది భారత దేశం అని తెలిపారు. ఇంకా మినిరల్స్ పై ఇతర దేశాలపై ఆధారపడి ఉన్నామని తెలిపారు. కోల్ అంశంలో ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేదని, దేశానికి కావాల్సినంత కోల్ ఉత్పత్తి చేసుకునే స్థాయికి ఎదిగామన్నారు.

మినరల్ విషయంలో మనం స్వయం సమృద్ధిగా ఎదగాల్సిన



అవసరం ఉందని తెలిపారు. మినరల్ అన్వేషణ కోసం సహకారం అందించేందుకు ట్రస్ట్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. మినరల్ అన్వేషణ కోసం ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ను ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ–ప్రైవేటు రంగ భాగస్వామ్యంలో గనుల తవ్వకం లో నూతన ఆవిష్కరణలతో పాటు మైనింగ్ సంబంధిత వర్గాల సంక్షేమం విషయంలో తమ ప్రభుత్వం నూతన ఆవిష్కరణలతో వైవిధ్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు.. స్వయం సమృద్ధిని పెంచడమే తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు.

ఖనిజ క్షేత్రంలో స్వయం సమృద్ధి సాధించడానికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అంటూ మనమంతా సంఘటితంగా పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుందని అన్నారు. ఈ మహాయజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని తాను కోరుకుంటున్నానని అన్నారు. మనందరం కలిసి మోదీ లక్ష్యం ఆత్మ నిర్భర్ భారత్ కలను నిజం చేయడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు కేంద్ర మంత్రి . .

# మహిళతో అసభ్యకరంగా చాటింగ్.. సనత్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పై వేటు

హైదరాబాద్ జూలై 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);;: సనత్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పురేందర్ రెడ్డి వేటు పడింది. ఓ మహిళతో అసభ్యకరంగా చాటింగ్ చేయడంతో అతడిని సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ సిపి ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన మహిళతో అసభ్యకరంగా చాటింగ్ చేశారు. దీంతో బాధితురాలు సైబరాబాద్ సిపిను ఆశ్రయించింది. సిఐ చేసిన చాటింగ్ ను బాధితురాలు సిపికి చూపించింది. అందంగా ఉన్నావు, చెప్పిన ప్లేస్ కి రావాలి అంటూ సిఐ సందేశాలు పంపినట్టుగా చాటింగ్ లో ఉండడంతో సిఐపై వేటు పడింది.

# 25న తెలంగాణ బడ్జెట్.. ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష



హైదరాబాద్, జులై 20 : ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. శాసనసభ్యులు లేవనెత్తే అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచరంతో సమాధానాలు పంపాలని ఆమె అధికారులను ఆదేశించారు. బడ్జెట్ సెషన్‌లో సమన్వయ లోపం గ్యాప్ లేకుండా చూసేందుకు సీనియర్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సీఎస్ ఆదేశించారు.

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఈ నెల 25న ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు తెలిపారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనుంది. నోట్ ఆన్ డిమాండ్ రూపొందించి బడ్జెట్‌ను సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, నవీన్ మిట్టల్, శైలజా రామయ్యర్, కార్యదర్శులు రఘునందన్‌రావు, బుద్ధ ప్రకాష్ జ్యోతి, వి కరుణ, లోకేష్ కుమార్, సిఐపిఆర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 23న ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభం కానుంది. సభ ప్రారంభమైన వెంటనే ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రసంగం చేయనున్నారు. ఇక మండలి సమావేశాలు 24వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అసెంబ్లీ సెక్రటరీ ప్రకటన విడుదల చేశారు

# హుస్సేన్ సాగర్‌కు భారీ వరద.. రెండు గేట్లు ఎత్తివేత

హైదరాబాద్, జులై 20 : నగరంలో నిన్న (శుక్రవారం) రాత్రి నుంచి ముసురు కొనసాగుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో? హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్ భారీ వరదలతో నిండిపోయింది. దీంతో అధికారులు 2 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. చెరువు పూర్తి సామర్థ్యం 514 అడుగులు కాగా, ప్రస్తుతం 513 అడుగుల నీటి నిల్వ ఉంది.

ఇక రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిందని దీని ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# భద్రాచలం వద్ద గోదావరిలో పెరుగుతున్న వరద.. 35 అడుగులకు చేరిన ప్రవాహం..

ఖమ్మం, జులై 20 :భారీ వర్షాలకు గోదావరిలో వరద ఉధృతి పెరుగుతున్నది. భద్రాచలం వద్ద గోదావరి వరద ముంచెత్తుతున్నది. శనివారం మధ్యాహ్నం 4 గంటల వరకు 35 అడుగులకు నీటమట్టం చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు కొనసాగుతున్నందున ఇంకా గోదావరిలో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని అధికారులు 44 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరింకు జారీ చేసే అవకాశం ఉండనున్నది. గోదావరిలో 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద జారీ చేస్తారు. వరదల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు అధికారులను అప్రమత్తం చేశారు. మరో వైపు భద్రాచలంలోని తాలిపేరు జలాశయానికి భారీగా వరద కొనసాగుతున్నది. దాంతో అధికారులు ప్రాజెక్టు 26గేట్లు ఎత్తివేశారు. వచ్చిన వరదను దిగువకు వదులుతున్నారు.

### నేటి కందం– నేటికీ అందం

విమలమగు పంచశీలను
ప్రమదముతో జగతికిడిన భరతావనికిన్
క్రమమెరుగని చైనాతో
సమరమ్మో దినమునందు సంప్రాప్తించెన్



(21-7-1962 చైనాతో ఘర్షణ ప్రారంభం )

-రాధశ్రీ
సెల్:9494481210

# పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి .. ఉప ముఖ్యమంత్రి భట్టి



హైదరాబాద్, జులై 20 : రాష్ట్రంలో అదిలాబాద్, ఖమ్మం, మహబూబూ నగర్, వరంగల్ వంటి జిల్లాల్లో పచ్చని, దట్టమైన అడవులు.. జలపాతాలు ఉన్నాయని,. వాటిని గుర్తించి ఐటీ ఉద్యోగులు, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించి ఆదాయాన్ని పెంచుకోవాలని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కమల్లు సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయ లో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పర్యాటక, సాంస్కృతిక, క్రీడా, బడ్జెట్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.

గత ఏడు నెలలుగా సాంస్కృతిక సారధి కళాకారుల ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారని బట్టి మల్లు ఆరా తీశారు. కళాకారులను సమాజ అభివృద్ధికి పూర్తిగా వాడుకోవడం లేదని.. వారి సేవలు వినియోగించుకునేందుకు ఓ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో అనేక నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో వదిలేసిందని, ఫలితంగా వందలాది కోట్ల రూపాయల ప్రజాధనం నిరుపయోగమైందన్నారు.

గతంలో ప్రారంభించి 90 శాతం పూర్తి చేసిన భవనాలను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేయాలని, మిగిలిన భవనాలు దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో క్రీడామైదానాలు ఉన్నాయని, . వాటిని నిరుపయోగంగా ఉంచడం మూలంగా ఆక్రమణలు జరుగుతున్నాయని వివరించారు డిప్యూటీ సిఎం.. అధికారులు వెంటనే స్పందించి.. నిత్యం క్రీడలు నిర్వహించి మైదానాలను ఉపయోగించుకోవాలని ఆదేశించారు.

రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యార్థుల కు క్రీడా మైదానాల్లో క్రీడలు నిర్వహించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొన్నిచోట్ల క్రీడామైదానాలు ఆక్రమణలకు గురైనట్టుగా సమాచారం ఉంది.. వెంటనే ఆ విషయాలపై దృష్టి సారించి ఆక్రమణ దారులను ఖాళీ చేయించండి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఏడాది మొత్తంగా ప్రభుత్వ క్రీడా మైదానాల్లో యాక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పర్యాటక శాఖ సొంత ఆస్తులు, లీజ్ లో ఉన్న ఆస్తుల వివరాలపై ఒక సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, అడవులను పర్యాటక సాంస్కృతిక శాఖలు పెద్ద సంఖ్యలో వినియోగించుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు భట్టి.

కల్చర్ అంటే ఆటలు పాటలు అనుకుంటున్నారని, .. కానీ కల్చర్ అంటే జీవన విధానం అని చాలామందికి తెలియదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కళాకారులు ప్రజల జీవన విధానంలో మెరుగైన మార్పులు తెచ్చేందుకు తీసుకునే ఆహారం, వేసుకునే దుస్తులు ఇలా అన్ని అంశాల పైన గ్రామీణ ప్రజానీకాన్ని చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి అన్నారు. రాష్ట్రంలో ఉన్న చెక్ పోస్ట్ లను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు సమగ్ర ప్రణాళికలు చేయాలని అధికారులను మంత్రి జూపల్లి ఆదేశించారు.

రాష్ట్రంలో సంస్కృతి, వారసత్వ సంపదలు ఘనంగా ఉన్న ఆ మేరకు వాటిని వినియోగించుకుని పూర్తిస్థాయిలో ఫలితాలు సాధించలేకపోతున్నాం, రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించేందుకు దృష్టి సారించాలని మంత్రి జూపల్లి ఆదేశించారు.

ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారి ఎస్ ఎ రిజ్వి, ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, యూత్ సర్వీసెస్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి శ్రీధర్, ఆర్కియాలజీ డైరెక్టర్ భారతి హోలికేరి, టూరిజం కార్పొరేషన్ ఎండి ప్రకాష్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల టైమింగ్స్‌లో మార్పులు- ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, జులై 20 : పాఠశాలల వేళలను మారుస్తూ తెలంగాణ విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక పాఠశాలల సమయానికి అనుగుణంగా ఉన్నత పాఠశాలల్లో సమయాన్ని మార్చారు. ఇప్పటి వరకు ఉన్నత పాఠశాలల పనివేళలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు ఉండగా? తాజాగా ఉన్నత పాఠశాల సమయాన్ని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు మారుస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అయితే, హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం అమలులో ఉన్న పని వేళలే కొనసాగుతాయని సూచించింది. దీంతో జంట నగరాల్లో ఉదయం 8.45 గంటల నుంచి సాయంత్ర నాలుగు గంటల వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. ఈ మేరకు చర్యలు తీసుకోవాలంటూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలిచ్చారు.

# దేశభక్తిని జాగృత పరిచే త్రివర్ణ పతాకం !

## (22 జూలై 'జాతీయ పతాక ఆమోద దినోత్సవం' సందర్భంగా)

త్రివర్ణ పతాక రెపరెపలు ప్రతి భారతీయ పౌరుడి హృదయంలో దేశభక్తిని జాగృతం చేస్తూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా మన దేశ ప్రతినిధిగా భారతీయ సనాతనతత్వాన్ని విశ్వవ్యాప్తం చేస్తుంది. స్వాతంత్ర్య పోరాట యోధుల ప్రాణ త్యాగాలను గుర్తు చేస్తూనే పౌరులలో దేశ భక్తి, విశ్వాసాలను ఇనుమడింపజేస్తుంది. దేశంలో సంపదలు, శాంతి స్థాపన, గత త్యాగాలకు మరోరూపంగా నిలుస్తున్న భారత జాతీయ జెండా ప్రతిష్ట, ప్రాభవాలను ఇనుమడింప చేయడానికి ప్రతి ఉత్తమ పౌరుడు కృషి చేయాల్సిన కనీస బాధ్యతను తీసుకోవాలి.

రూపశిల్పి తెలుగు తేజం పింగళి వెంకయ్య:

విద్యార్థిగా తెలుగు తేజం పింగళి వెంకయ్య 1916లో రూపొందించిన 30 రకాలైన పతాకాలు ప్రతిపాదించారు. వీటిలోంచి కాషాయ, ఆకుపచ్చ చారలు కలిగిన పతాకాన్ని 1921లో మహాత్మాగాంధీకి అందించడం జరిగింది. నాటి జెండాలోని కాషాయ వర్ణం హిందువులను, ఆకుపచ్చ రంగు ముస్లిమ్‌లను చూచించేలా రూపొందించారు. గాంధీ సూచనల మేరకు కాషాయ, ఆకుపచ్చ చారల మధ్య తెలుపు వర్ణపు పట్టీని చేర్చారు. మే 1923 నాగపూర్ నిరసన కార్యక్రమాల్లోనే కాకుండా రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో సుభాష్ చంద్ర బోస్ కూడా ఈ జెండాను వాడినట్లు చరిత్ర చెబుతోంది. లాలా హన్స్ రాజ్ సలహాతో తెలుపు వర్ణ చార మధ్యలో స్పిన్నింగ్ రాట్నం అమర్చడంతో భారతీయులు తమ వస్త్రాలను తామే తయారు చేసుకుంటారనే స్వావలంభన భావనను వ్యక్తపరిచినట్లు అయ్యింది. దీనిని ఆగష్టు 1931 ఆల్ ఇండియా కాంగ్రేస్ సమావేశంలో ఆమోదించారు.

జాతీయ పతాక ప్రత్యేకతలు:

ఖాదీ నూలుతో చేయబడిన నేటి జాతీయ పతాకపు కొలతలు 2:3 నిష్పత్తితో ఉంటూ, పైభాగాన ఉన్న కాషాయం, మధ్యలో తెలుపు, కింది భాగాన ఆకు పచ్చ వర్ణాలు సమాన వైశాల్యాలతో అడ్డం చారలుగా ఉన్నాయి. కాషాయం త్యాగం / ధైర్యాలను, తెలుపు శాంతి / స్వచ్ఛత / సత్యాలను, ఆకుపచ్చ రంగు నమ్మకం / సంపద / ధైర్యసాహసాలను సూచిస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం జెండా మధ్యలో అమర్చిన స్పిన్నింగ్ రాట్నానికి బదులుగా 24–చువ్వలు కలిగిన నీలి వర్ణపు అశోకుడి ధర్మ చక్రం చేర్చారు.

జెండాను ఆమోదించిన తొలి గడియలు:

ప్రస్తుత రూపంలో ఉన్న భారత జాతీయ పతాకాన్ని 23 జూన్ 1947న రాజెంద్ర ప్రసాద్, మౌళానా అబుల్ కలాం ఆజాద్, రాజగోపాలాచారి, అంబేద్కర్, సరోజినీ నాయుడు లాంటి పలువురితో కూడిన కమిటీ సమావేశంలో ఎంపిక చేయగా, 22 జూలై 1947న జరిగిన రాజ్యాంగ అసెంబ్లీ సమావేశంలో భారత జాతీయ జెండాను ఆమోదించడంతో పాటు ఈ త్రివర్ణ పతాకాన్ని భారత జాతీయ కాంగ్రేస్ సమావేశంలో అధికారికంగా ఎగురవేశారు. ఆ రోజు నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా ప్రతి ఏటా 22 జూలైన 'భారత జాతీయ పతాక స్వీకరణ/ఆమోద దినం' పాటించబడుతున్నది. భారత జాతీయ పతాక ఆమోద దినం సందర్భంగా ప్రభుత్వ సమావేశాలు, పతాక రెపరెపల నడుమ జాతీయ గీతాలాపనలు, రక్షణరంగ త్రివిధ దళాల సేవలు కొనియాడడం, కవాతులు, జెండా చేతబూని ర్యాలీలు, దేశభక్తిని నింపే కార్యక్రమాలు నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది.

మన జాతీయ పతాకం పట్ల అచంచల విశ్వాసాన్ని వ్యక్తీకరిస్తూ, మనం అక్షరాల తత్పదానుగాములమని ఎన్నటికీ మరువరాదు. మనలో ప్రతి ఒక్కరం జాతీయ పతాక వైభవాలను ఇతోధికం చేయడానికి అవిరళ కృషి చేద్దాం. భారతీయ పౌరుల సత్కర్మలతోనే మన పతాకం సభ్యదేశాలలో సమున్నతంగా, సగర్వంగా ఎగురుతుంది. సువర్ణాక్షరాల్లో లిఖించబడిన పతాక పవిత్ర చరిత్ర మన దేశానికి సత్కీర్తిని సమకూర్చుతూ, ఉత్తమ కృషి సలుపడానికి మనందరికి ప్రోత్సాహ ప్రోద్భలాలను అందిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

జై హింద్ : జై జవాన్ : జైకిసాన్ : జైవిద్వాన్, జై అనుసంధాన్

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# బిబికా అలానీ కు దట్టిని సమర్పించిన జి.హన్మంత్ రావు, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం



హైదరాబాద్ జూలై 20 (ఎక్స్ ప్రెన్ న్యూ న్);మొహరం పురస్కరించుకొని హైదరాబాద్‌లోని మీరాలం మండి వద్ద బిబికా అలాం కు జయహో భారతీయం అధ్యక్షుడు జి.హన్మంత్ రావు, రాష్ట్ర బీసీ కమిషన్ తెలంగాణ చైర్మన్ డా. వి. కృష్ణ మోహన్ రావులు దట్టిని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా హైదరాబాద్ నగరం నిలిచిందన్నారు మొహరం ఊరేగింపు లో హిందూ ముస్లిములు కలిసి పాల్గొనడం అభినందనీయమన్నారు ఈ కార్యక్రమం లో హిదాయెత్ అలీ మీర్జా డైరెక్టర్ షియా మండలి, సయ్యద్ మహమూద్ అలీ, హాషమ్ హుసన్, సయ్యద్ సయీద్ అల్లం, ఇ. మాణిక్యం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిషింగ్ ఈమెయిల్స్ లేక అనుమానస్పద లింకులపై క్లిక్ లు చేయకూడదు

### – హెచ్చరించిన యూఎస్ సైబర్ సెక్యూరిటీ

న్యూఢిల్లీ జూలై 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మైక్రోసాఫ్ట్ ఔటేజ్ కారణంగా హ్యాకర్లు అడ్వాంటేజ్ తీసుకునే ప్రయత్నం చేస్తారని అమెరికా సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ సిఐఎస్ఏ హెచ్చరించింది. మైక్రోసాఫ్ట్ సిస్టం ను తిరిగి సురక్షితం చేసేందుకు తీవ్రంగా పనిచేస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సిఈవో సత్యా నాదెళ్ల అన్నారు. ఫిషింగ్ ఈమెయిల్స్ లేక అనుమానస్పద లింకులపై క్లిక్ లు చేయకూడదని యూఎస్ సైబర్ సెక్యూరిటీ హెచ్చరించింది. ఆయా సంస్థలు తమ వినియోగదారుల ఆస్తులు, డేటాను కాపాడే చర్యలు చేపట్టాలని కూడా హెచ్చరించింది. " ఔటేజ్ విండోస్ 10, తదనంతర సిస్టంలను ప్రభావితం చేసింది. క్రౌడ్ స్ట్రయిక్ ఫాల్కన్ కంటెంట్ అప్డేట్ కారణంగానే ఈ ఔటేజ్ సంభవించింది తప్ప, హానికరమైన సైబర్ కార్యకలాపాల వల్ల కాదు" అని నాదెళ్ల 'ఎక్స్' పోస్ట్ లో తెలిపారు. " మేము ఈ సమస్యను గుర్తించాము. క్రౌడ్ స్ట్రయిక్ తో, ఐటి పరిశ్రమ తో కలిసి పనిచేస్తున్నాము. కస్టమర్లకు సాంకేతిక మార్గదర్శకత్వం, మద్దతు ఇచ్చి సిస్టమ్స్ లను మళ్లీ సురక్షితం గావించేందుకు కృషి చేస్తున్నాము" అని ఆయన తెలిపారు.

# హైదరాబాద్‌లో ఖనిజాన్వేషణ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్స్ రోడ్ షో ను నిర్వహించనున్న గనుల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జులై 20 :గనుల మంత్రిత్వ శాఖ రేపు, (శనివారం) హైదరాబాద్ బేగంపేట లో ఖనిజాన్వేషణ పై హ్యాకథాన్, క్రిటికల్ మినరల్స్ పై రోడ్ షో ను నిర్వహించనుంది. ఈ కార్యక్రమం లో కేంద్ర బొగ్గు–గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, ఆ శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దుబే లు పాల్గొంటారు. బిహార్ ఉప ముఖ్యమంత్రి శ్రీ విజయ్ కుమార్ సిన్హా ఈ కార్యక్రమం లో ప్రత్యేక అతిథిగా పాల్గొననున్నారు.

ఖనిజాలను అన్వేషించడంలో వినూత్న పద్ధతులపై ఖనిజాన్వేషక సంబంధ హ్యాకథాన్ దృష్టిని కేంద్రీకరించనుంది. ప్రపంచమంతటా అనుసరిస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞ?నాన్ని, ఖనిజ నిక్షేపాల జాడలను గుర్తించాలనేది ఈ కార్యక్రమం లక్ష్యం. భూ భౌతిక సమాచారాన్ని, తత్సంబంధ నమూనాలను, ఈ మధ్య కాలం లో ఉనికిలోకి వచ్చిన కృత్రిమ మేధ (ఎఐ), మెషిన్ లెర్నింగ్ (ఎమ్ఎల్) వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రక్రియలో వినియోగించుకోవాలనే అంశంపై కార్యక్రమంలో కూలంకషంగా చర్చిస్తారు.

ఇదే కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డిఎమ్ఎఫ్) పోర్టల్ ను కూడా ప్రారంభించనున్నారు. ఈ పోర్టల్ దేశవ్యాప్తంగా డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్స్ కు సంబంధించిన సమాచారాన్ని సమీకరించడానికి కేంద్రీకృత వేదికగా ఉంటుంది. ఈ పోర్టల్ డిఎమ్ఎఫ్ డేటాను అందుబాటులో ఉంచడమే కాక దాని వినియోగాన్ని పర్యవేక్షిస్తుంది.

గనులు, ఖనిజాల అభివృద్ధి, క్రమబద్ధీకరణ (ఎమ్ఎమ్‌డిఆర్) సవరణ చట్టంలోని సెక్షన్ 11డి ప్రకారం దఖలు పడ్డ అధికారాలను గనుల మంత్రిత్వ శాఖ ఉపయోగించుకొంటూ కీలక, వ్యూహాత్మక ఖనిజాల ఇ- వేలంపాట (ఇ–ఆక్షన్) రెండో, మూడో విడతలను గత ఫిబ్రవరి 29న మొదలు పెట్టింది. రెండో, మూడో విడత బ్లాకులకు ఎంపికైన బిడ్డర్ ల వివరాలను కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రకటించనున్నారు.

ఈ కార్యక్రమం ముగిసిన తరువాత కీలక, వ్యూహాత్మక ఖనిజాల బ్లాకుల ఇ–వేలంపాట (ఇ–ఆక్షన్) నాలుగో విడత కు సంబంధించిన రోడ్ షో ఉంటుంది. ఈ నాలుగో విడత ఇ–ఆక్షన్ ను కిందటి నెల 24న ఎన్ఐటి ద్వారా ఆరంభించడమైంది. ఇ–వేలం ప్రక్రియలో పరిశ్రమ భాగస్వామ్యాన్ని పెంచడానికి, గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించే ఇ–వేలం ప్రక్రియ తీరుతెన్నులను ఆసక్తి గల బిడ్డర్ లకు తెలియజేయడానికి రోడ్ షో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

# నూతన ఆవిష్కరణలకు సంగారెడ్డి జిల్లా వేదిక కావాలి

### –జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి, జులై 20 : (నేటినిజం ప్రతినిధి):సోమవారం



కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా వివి ఆవిష్కరణ ప్రదర్శించే నూతన ఆవిష్కరణల కోసం ప్రతి ఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. విద్యాశాఖ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాఠశాలలతో పాటు గ్రామాల్లో ఈ కార్యక్రమం పై విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

ప్రస్తుత సంవత్సరంలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలతో తమ ప్రతిభకు పదును పెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదని పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణుల ఆవిష్కరణ, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయ రంగ ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలతోపాటు తదితర ఆవిష్కరణలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆవిష్కరణ పేరు,ప్రదర్శనకు గల రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫోటోలు, 100 పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 9100678543 కు పంపాలని సూచించారు. పేరు, వయస్సు, ఫోటో,వృత్తి,గ్రామం పేరు, జిల్లా పేరుతో వివరాలతో ఆగస్టు 3వ తేదీ లోపు పంపించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్ ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు చంద్రశేఖర్ , మాధురి , డి ఆర్ ఓ పద్మజారాణి , ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా రిప్రెసెంటివ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి, దరఖాస్తులను ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలి

### -కలెక్టరేట్ లో శానిటేషన్, కార్యాలయాల నిర్వహణ బాగుండాలి.

### -జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి, జులై 20 : (నేటినిజం ప్రతినిధి):ప్రజావాణి,



కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును త్వరితగతిన పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు ఆదేశించారు

సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 75 మంది దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు.

ప్రజావాణి లో అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.

కలెక్టరేట్ లో , పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా నిర్వహణ చేయాలనీ, కలెక్టర్ అధికారులు ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమంలో 75 అర్జీలకు గాను ధరణి, రెవిన్యూ శాఖ కు సంబంధించినవి, పెన్షన్ , పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ, వచ్చాయని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ , మాధురి, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజా రాణి, సంబంధిత జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం చంద్రబాబు పేషీలోని ఐఏఎస్‌లకు శాఖలు కేటాయింపు..

అమరావతి, జులై 20 : ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయంలోని నలుగురు అధికారులు పర్యవేక్షించాల్సిన శాఖలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు సీఎం కార్యాలయం, సాధారణ పరిపాలనశాఖ, హోమ్, ఆర్థిక, ఎక్సైజ్, రెవెన్యూ, దేవాదాయ శాఖలు కేటాయించారు.

ఏవీ రాజమౌళికి జలవనరులు, విద్యుత్, గనులు, వ్యవసాయం, సీఎంఆర్ఎఫ్, ఫిర్యాదులు తదితర శాఖలు పర్యవేక్షించనున్నారు. ప్రద్యుమ్నకు రవాణా, పురపాలక, పంచాయతీరాజ్, ఆర్టీజీఎస్, అటవీ, పౌరసరఫరాలశాఖలు కేటాయించారు. కార్తికేయ మిశ్రాకు ఆర్థిక, ఐటీ, ఎన్ఆర్ఐ వ్యవహారాలు, సమాచార పౌరసంబంధాలు, పరిశ్రమలు, సీఎం ఢిల్లీ, విదేశీ పర్యటనల సమన్వయం తదితర విభాగాలు చూడనున్నారు.

# తుపాకీ పేలి.. ఆర్మీ జవాన్ మృతి..

అమరావతి, జులై 20 : మండలంలోని జూనూతుల గ్రామానికి చెందిన ఆర్మీ జవాను సీఐఎస్ఎఫ్ లో విధులు నిర్వహిస్తున్న పెట్నీకోట వెంకటేష్(34) అనే జవాన్ హైదరాబాదులోని సిఐఎస్ఎఫ్ (బీడీఎల్, బనూర్) బెటాలియన్ లో విధులు నిర్వర్తిస్తుండేవారు. విధుల్లో ఉండగా తమ బెటాలియన్ కు చెందిన బస్సులో తన వద్ద ఉండే తుపాకీ పేలినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. తమ వద్ద ఉండే గన్ పేలడంతో తలలోకి బుల్లెట్లు చొచ్చుకుపోవడంతో జవాను అక్కడికక్కడే బస్సులోనే రక్తపు మడుగుల్లో కుప్పకూలిపోయాడు.

బస్సులో వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటన మిస్ ఫైర్ అయ్యి జరిగిందా? లేక ఇంకేమైనా జరిగిందా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతిచెందిన సిపాయి 13 సంవత్స రాల క్రితం ఉద్యోగంలో చేరాడు. మృతిచెందిన జవాను గతంలో రెండు సంవత్సరాల పాటు ఢిల్లీలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ నివాసం (ప్రధానమంత్రి రక్షణ దళం) వద్ద విధులు నిర్వర్తించాడు. మృతునికి ఒక కూతురు, కుమార్తె ఉన్నారు. తండ్రి పెట్నికోట వడ్డే వెంకటస్వామి, తల్లి కూలీ పనులు చేస్తూ జూనూతల గ్రామంలోని నివసిస్తున్నారు. ఉద్యోగంలో ఉన్న కొడుకు మరణించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

# కట్లేరుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద.. రాకపోకలు బంద్



అల్పపీడన ధోరణితో ఎడతెరపి లేని వర్షాలు కురవడం, ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరద నీటితో వినగడప సమీప కట్లేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కట్లేరు వద్ద ధ్వంసమైన వంతెనపై, తాత్కాలిక రహదారిపై మూడడుగుల ఎత్తులో వరద నీరు ఉధృతంగా పోటెత్తుతోంది. దీంతో రాకపోకలు మూడు రోజులుగా స్తంభించాయి. తహశీల్దార్ సుగుణ ఆదేశాలతో ఎస్సై ఎన్.శ్రీను ఆధ్వర్యంలో సిబ్బంది ఎవరినీ రానీయకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

కనుమూరు, అనుముల్లంక, నారికంపాడు, వినగడప, కొత్తపల్లి గ్రామాల ప్రజలు విద్య, వైద్యం, ఉపాధి కోసం మండల కేంద్రం గంపలగూడెం చేరుకోవాలంటే అదనంగా 25 కిలోమీటర్ల ప్రయాణించాల్సి వస్తుందని మండల ప్రజలు ఎవరైనా జిల్లా కేంద్రం విజయవాడ వెళ్లాలన్నా ఈ మార్గం నుండే ప్రయాణించాల్సి ఉండడంతో వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నారు. వర్షాలు తగ్గగానే తక్షణ చర్యల్లో భాగంగా యుద్ధప్రాతిపదికన శాశ్వత వంతెన నిర్మాణం పనులు చేపడితేనే ఎలాంటి సమస్యలు ఉండవని ప్రజలు కోరుతున్నారు.

# సైబర్ దాడుల విషయంలో బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలి

### – ఆర్ బిఐ చీఫ్ శక్తికాంత దాస్

న్యూఢిల్లీ జూలై 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ దాడుల దృష్ట్యా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు తమ ఐటి సిస్టంలపై నిఘాను హైలెవల్ లో మెయిన్ టైన్ చేయాలని భారత రిజర్వు బ్యాంకు(ఆర్ బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ శనివారం తెలిపారు.

డిజిటల్ మోసాలు మోసాలు పెరుగుతున్నాయని కూడా ఆయన హెచ్చరించారు.

మ్యూట్ బ్యాంక్ అకౌంట్స్ విషయంలో కూడా మోసాలు పెరుగుతున్నాయన్నారు.

థర్డ్ పార్టీ రిన్క్ లను తగ్గించుకోవాలన్నారు.

# కనకదుర్గమ్మకు శ్రీశైల భ్రమరాంబ అమ్మవారికి సారె..

### -సాంప్రదాయ బద్ధంగా తీసుకువచ్చిన ఆలయ అధికారులు..

### -స్వాగతం పలికిన ఈవో కె ఎస్ రామారావు..



అమరావతి, జులై 20 : విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువైయున్న కనకదుర్గమ్మకు శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం నుండి పవిత్ర సారేను సమర్పించారు. ఆషాడ మాసం సందర్భంగా దేవస్థానంలో శ్రీ అమ్మవారికి పవిత్ర సారె సమర్పించు కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీ భ్రమరాంభికా మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానం, శ్రీశైలం నుండి ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ఆలయ అధికారులు కనకదుర్గ అమ్మవారికి ఆషాడ సారె సమర్పించుటకు విచ్చేయగా వీరికి దుర్గ గుడి ఆలయ కార్యనిర్వహణాధికారి కె ఎస్ రామరావు ఆలయ మర్యాదలతో మంగళ వాయిద్యాల నడుమ స్వాగతం పలికారు.

అనంతరం వీరు అమ్మవారిని దర్శనం చేసుకొని అమ్మవారికి సారే తెప్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రము, చిత్రపటం అందజేశారు. అనంతరం శ్రీశైలం దేవస్థానం వారు శ్రీ దుర్గ గుడి కార్యనిర్వాహనాధికారి కేఎస్ రామారావు, సిబ్బందికి శ్రీశైలం దేవస్థానం శేషవస్త్రం, ప్రసాదములు చిత్రపటము అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మహామండపం 6వ అంతస్తు లో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి, అందరికీ ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైదిక సిబ్బంది, సహాయ కార్యనిర్వాహనాధికారి , శ్రీశైలం దేవస్థానం అర్చకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరకు సర్వం సిద్ధం

హైదరాబాద్, జులై 20 : సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర రేపు జరగనుంది. బోనాల జాతరకు అధికారులు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. బోనాల జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. 21, 22 తేదీల్లో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఉజ్జయిని మహంకాళి టెంపుల్‌కు 2 కిలో మీటర్ల పరిధిలో ఈ అంక్షలు అమల్లో ఉండనున్నాయి. కర్బాలా మైదాన్, రాణిగంజ్, రామ్‌గోపాల్‌పేట్ ఓల్డ్ పీఎస్, పారడైస్, సీటీవో ప్లాజా, ఎస్బీఐ ఎక్స్ రోడ్, వైఎంసీఏ ఎక్స్ రోడ్, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్ ఎక్స్ రోడ్, ప్యాట్నీ ఎక్స్ రోడ్, పార్క్‌లేన్, బాటా, బైబిల్ హౌజ్, మినిస్టర్ రోడ్, రసూల్‌పురా వైపు వచ్చే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. ఇక సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులను కూడా పోలీసులు అలర్ట్ చేశారు. స్టేషన్‌లోకి ప్లాట్ ఫాం నంబర్ 1 నుంచి కాకుండా ప్లాట్ ఫాం నంబర్ 10 నుంచి లోపలికి చేరుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

# పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై గవర్నర్‌కు బీఆర్ఎస్ వినతిపత్రం

హైదరాబాద్ జూలై 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: నిరుద్యోగులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష కట్టిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్ఎ కెటిఆర్ విమర్శలు గుప్పించారు. కెటిఆర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎంఎల్ఎలు గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ను కలిశారు. పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. అప్రజాస్వామికంగా విద్యార్థులపై దాడులు, కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలేదని గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఉద్యమ సమయంలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయని, గ్రంథాలయాల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించారని, అక్రమంగా బిఆర్ఎస్ ఎంఎల్ఎలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నారని కెటిఆర్ ధ్వజమెత్తారు. ఎంఎల్ఎలను చేర్చుకోవడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని, ఫిరాయింపుపై న్యాయ ప్రక్రియ నడుస్తుందని గవర్నర్‌కు తెలిపామన్నారు. వెంటనే గవర్నర్ స్పందించి, ఫిరాయింపులపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారన్నారు. మేడిగడ్డ కొట్టుకుపోయిందని, కాళేశ్వరంలో లక్ష కోట్లు గంగపాలు అయ్యిందంటూ చిల్లర ప్రచారం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. అక్కడ జరిగిన చిన్న విషయంపై తప్పుడు ప్రచారం చేశారని దుయ్యబట్టారు. కొన్ని రోజుల్లోనే రిపేర్లు పూర్తి చేశారని, ఇప్పుడు వరదలాగ నీళ్లు వస్తున్న మేడిగడ్డ తట్టుకోవటమంటే అదే కాళేశ్వరం గొప్పతనమని ప్రశంసించారు. త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తామని ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని కెటిఆర్ స్పష్టం చేశారు. పరీక్షలు వాయిదా వేస్తే కోచింగ్ సెంటర్లకు వందల కోట్లు లాభం వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని, ఇప్పుడు నాలుగు నెలలు వాయిదా వేశారని, ఇప్పుడు నాలుగు వందల కోట్లు లాభాలు వస్తున్నాయా? అని ప్రశ్నించడంతో పాటు అందులో సిఎం వాటా ఎంత? అని అడిగారు.

# అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు.. సీపీ శ్రీనివాస్



ఆదిలాబాద్, జులై 20 :గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావొద్దని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ కోరారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేసారు.

ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే, స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని తెలిపారు. అధికారుల సూచనలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజల భద్రత, ప్రాణ రక్షణను దృష్టిలో పెట్టుకొని డ్యామ్స్, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని, సాధారణ పరిస్థితి వచ్చే వరకు అక్కడికి ప్రజలెవరూ వెళ్లకూడదని సూచించారు.

# ఎట్టకేలకు వడ్లమ్మిన రైతులకు డబ్బులు పంపిణీ..

## -కాజేసిన ఇన్చార్జి నుంచి వసూళ్లు
## -రూ.11 లక్షల 85వేలు చెల్లింపు

ఆదిలాబాద్, జులై 20 :ఎట్టకేలకు వడ్లమ్మిన 14మంది రైతులకు రూ.11 లక్షల85 వేలు శనివారం వరకు పంపిణీ చేశారు. రైతులు బాదంపెల్లిలో ఏర్పాటు చేసిన ఆ సింగల్ విండో ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంలో వడ్లను విక్రయించారు. సెంటర్ ఇన్చార్జి



నేరుగా రైతులకు డబ్బులు ఇచ్చి రశీదులు తీసుకున్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొనకల్ సింగల్ విండో సొసైటీలో వడ్లమ్మిన 14మంది రైతుల రూ.12 లక్షల గోల్ మాల్ వ్యవహారం గతంలో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం విధితమే. గత యాసంగిలో మండలంలోని బాదంపల్లి, చింతలపల్లికి చెందిన 14మంది మండలంలోని చింతలపల్లివాసి గందోరి రవి ఆ రైతుల డబ్బులను సొంతానికి వాడుకొనగా, విషయం తెలుసుకున్న రైతులు ఈనెల 1న సొసైటీ కార్యాలయానికి ఆయా గ్రామాలకు చెందిన రైతులు, నేతలు దాసరి తిరుపతి, సులువ జనార్ధన్, కొండపల్లి మహేష్, కె.మనోహర్ రావు, తదితరులు విచారణకు వచ్చిన అధికార్లను లోపల ఉంచి కార్యాలయ గేటుకు తాళం వేసి ఆందోళన చేశారు. దీంతో అప్పుడు మంచిర్యాల డీసీఓ రామ్మోహన్ ఆదేశాల మేరకు సొసైటీ సబ్ రిజిస్టర్ రవీందర్ రావు, కార్యాలయ సీనియర్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావు విచారణ చేశారు. ఆ విచారణలో ఆ సెంటర్ ఇన్చార్జి గందోరి రవి ఆ డబ్బులను ఇతర రైతుల ఖాతాలోకి మార్చి కాజేసినట్లు ఒప్పుకొని, తిరిగి డబ్బులు చెల్లిస్తానని రాతపూర్వకంగా రాసి సొసైటీకి అందజేశారు. ఈ వ్యవహారమై సొసైటీ చైర్మన్ అల్లం రవి, సెంటర్ ఇన్చార్జి గందోరి రవి పైఈ నెల 5న స్థానిక పోలీస్ స్టేషన్ లోనూ ఫిర్యాదు చేశారు.

ఆ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మిక్కిలినేని రాజశేఖర్ ప్రత్యేక చొరవతో, ఆ సొసైటీ చైర్మన్ అల్లం రవి, డైరెక్టర్లు ఎండి సాదుపాషా, కానగంటి స్వరూపరాణి దేవన్న, బి.సత్యనారాయణ, అనుముల శ్రీనివాస్ లు శ్రద్ధ తీసుకొని అటు రైతులతోనూ, సెంటర్ ఇన్చార్జి రవి, కార్యదర్శి రాజన్న తోను సంప్రదించి ఓ నిర్ణయానికి వచ్చి ఇన్చార్జి రవి చెక్కులను సొసైటీకి ఇప్పించి, ఈనెల 20లోగా ఆ డబ్బులన్నింటిని రైతులకు చెల్లిస్తానని బాండ్ పేపర్ రాయించుకొని, కార్యదర్శి చెక్కులను రైతులకు అందజేశారు. రైతులు నష్టపోవద్దని సదుద్దేశంతో ముందుగా సెంటర్ ఇన్చార్జి రవి రూ.11లక్షల 85 వేలు మండలంలోని బాదంపల్లి, చింతలపల్లికి చెందిన మోటపలుకుల కమలాకర్, అరవ్వ, భూమన్నలతో పాటు 14 మంది రైతులకు ముందుగా చెప్పినట్లు శనివారంకు నగదు డబ్బులను అందజేశారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రజలతో మమేకమై పని చేయండి-రాష్ట్ర డీజీపీ జితేందర్

హైదరాబాద్, జులై 20 : సాంకేతిక వనరులను ఉపయోగిస్తూ విజుబులిటీ పోలీసింగ్‌తో ప్రజలతో మమేకమవుతూ ఉత్తమ సేవలందించాలని హైదరాబాద్ పోలీసులకు డీజీపీ జితేందర్ సూచించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఆడిటోరియంలో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి డీజీపీ హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా పోలీసింగ్‌లో మార్పు వచ్చిందని, స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉత్తమ పద్ధతులను గ్రహిస్తూ ప్రత్యేకతను కల్గి ఉండాలన్నారు. హైదరాబాద్ గ్లోబల్, కాస్మో పాలిటన్ నగర మానవ వనరులు, టెక్నాలజీ, భారీగా పెట్టుబడులతో ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి జరగడం, అత్యంత నివాస యోగ్యమైన నగరంగా గుర్తింపు



తెచ్చుకుందన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నగదు రహిత ట్రాఫిక్ చలాన్ విధానాన్ని అమలులోకి తెచ్చిన సందర్భంగా ఎదురైన సవాళ్లను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. సున్నితమైన విషయంలో మాట్లాడే సమయంలో ఎవరికి ఇబ్బంది లేకుండా మాట్లాడాలని, పౌరులతో సరిగా ప్రవర్తించాలని సూచించారు. ఫిర్యాదుదారులను తిప్పి పంపకూడదని వారి సమస్యను తెలుసుకోవాలన్నారు. నేరాలను అదుపు చేయాలని, సాంకేతిక పరమైన శిక్షణ తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఎన్‌ఫోర్స్‌మెంట్, సిగ్నల్స్ వినియోగం సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టాలని, ట్రాఫిక్ విభాగం చేసే పనులను పౌరులతో పంచుకోవాలని సూచించారు.

వీఐపీ సంస్కృతిని అరికట్టడంతో పాటు సోషల్‌మీడియాను హ్యాండిల్ చేసేందుకు మంచి టీమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీలు విక్రమ్‌సింగ్ మాన్, విశ్వప్రసాద్, జాయింట్ సీపీ పరిమళ హననూతన్‌తో పాటు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

# కారు బోల్తా.. ఇద్దరు మృతి, పలువురికి గాయాలు

మెదక్, జులై 20 : సదాశివపేట మండలం మద్దికుంట ఆత్మకూర్ రోడ్డులోని లక్ష్మీకాంత స్పిన్నింగ్ మిల్ ప్రాంతంలో ఓ కారు బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే, పోలీసులు, స్థానికులు రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. మృతదేహాలతో పాటు, గాయపడిన వారందరినీ ఆసుపత్రులకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కడెం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు.. ఏ క్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం..

ఆదిలాబాద్, జులై 20 : నిర్మల్ జిల్లా కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షాలకు కురుస్తున్నందున ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి ఏ సమయంలోనైనా దిగువ ప్రాంతానికి నీరు వదిలే అవకాశముందని ఆ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాథోడ్ విటల్ శనివారం సాయంత్రం తెలిపారు.

సాయంత్రం 5 గంటల వరకు ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 700 అడుగులు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 690.175 అడుగులు నీరు చేరిందన్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడుతున్నందున ప్రస్తుతం ఉన్న ఇన్ ఫ్లో 5,716 క్యూసెక్కులు ఉందని, ఇంకా ఇన్ ఫ్లో ఎక్కువ పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

దీంతో వరద గేట్లు ఏ సమయంలోనైనా ఎత్తే అవకాశాలు ఉన్నందున దిగువ మంచిర్యాల జిల్లా గోదావరి పరివాహక ప్రాంతంలోని జాలర్లు, పశువుల కాపర్లు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

# 2024 ఇండియా మొబైల్ కాంగ్రెస్ కోసం 'ది ఫ్యూచర్ ఈజ్ నవ్' ఇతివృత్తాన్ని విడుదల చేసిన కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాధిత్య సింధియా

న్యూఢిల్లీ, జులై 20 :ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2024 కోసం 'ది ఫ్యూచర్ ఈజ్ నవ్' ఇతివృత్తాన్ని గురువారం(జూలై 18, 2024) కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖల మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా ఆవిష్కరించారు. సాంకేతిక పరిణామక్రమంలో భారత్ కీలకంగా నిలిచిన తీరును ఈ ఇతివృత్తం ప్రతిబింబిస్తోంది. భవిష్యత్తు అనేది కేవలం ఒక భావన కాదని, అది ప్రస్తుతం జరుగుతున్నది అని చాటేలా.. ప్రపంచాన్ని మార్చే సాంకేతికతలను చురుగ్గా రూపొందించడానికి గానూ సహకారం కోసం దూరదృష్టి గల వారు, మార్గదర్శకులు, ఆవిష్కర్తలను ఐఎంసీ 2024 ఒక్క చోటకు చేరుస్తోంది.




ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2024 కోసం నమోదు చేసుకోవడానికి ప్రత్యేకమైన యాప్, వెబ్‌సైట్‌ను కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖల మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా ప్రారంభించారు. తన పేరును మొదట నమోదు చేసుకోవడంతో పాటు ప్రతినిధులు, సందర్శకులు, కళాశాలలు, విద్యాసంస్థలు, ప్రభుత్వం, మీడియా నమోదు ప్రారంభమైనట్టు తన ప్రసంగంలో ప్రకటించారు.

తన ప్రసంగంలో కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి మాట్లాడుతూ... "ప్రజలను ఏకం చేసినప్పుడే సాంకేతికత అనేది ఉత్తమం అవుతుంది. దీనికి సరైన ఉదాహరణ మన భారతదేశం" అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిబద్ధతకు అనుగుణంగా దేశవ్యాప్తంగా విభజనలను పూడ్చడంలో సాంకేతికత పాత్ర గుర్తించి ఆయన ప్రస్తావించారు. "సాంకేతికత, కమ్యూనికేషన్లు అనేవి సరికొత్త అవకాశాలకు వేదికను కల్పిస్తాయి. కమ్యూనికేషన్లు, నెట్‌వర్క్‌లు దేశంలోని అన్ని గ్రామాల ప్రజలను ఒకచోటకు చేరుస్తాయి'' అని పేర్కొన్నారు.

ఐఎంసీ అంతర్జాతీయంగా కీలక కార్యక్రమమని, భవిష్యత్తులో ఇలాంటి వేడుకలకు భారత్ కేంద్రంగా ఉంటుందని కమ్యూనికేషన్ల శాఖ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఫ్యూచర్ ఈజ్ నవ్' ఇతివృత్తం.. మన సామర్థ్యాలు, మన విజయాలు, భవిష్యత్తు అవకాశాలను సూచిస్తోందని అన్నారు. గత పదేళ్లుగా భారతదేశంలో టెలికాం రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. గతంలో సాంకేతికతకు వినియోగదారుగా ఉన్న భారత్ ఇప్పుడు సాంకేతికతకు సరఫరాదారుగా మారిందని పేర్కొన్నారు.

దేశంలో వచ్చిన టెలికాం చట్టం 2023, పీఎల్ఐ పథకం, వేగంగా 5జీని అందుబాటులోకి తేవడం వంటి టెలికాం సంస్కరణలను ఆయన ప్రశంసించారు. రానున్న 180 రోజుల్లో టెలికాం చట్టం 2023 నిబంధనలను నోటిపై చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా 2023కు గానూ పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ టెలికాం ఎక్సెలెన్స్ అవార్డులను టెలికమ్యూనికేషన్ల విభాగం ప్రకటించింది. టెలికాం ఆవిష్కరణలు, నైపుణ్యాలు, సేవలు, తయారీ, అప్లికేషన్లలో ఆదర్శవంతమైన, అత్యుత్తమ సేవలకు గానూ వీరికి అవార్డులు దక్కాయి.

స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈల కోసం పరీక్ష పథకాన్ని కేంద్రమంత్రి ప్రారంభించారు. సైబర్ సెక్యూరిటీలో సామర్థ్య నిర్మాణానికి ఎన్‌టీఐపీఆర్ఐటీ, ఐఐటీ జమ్ము మధ్య కుదిరిన ఒప్పందాన్ని ఆయన పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా కమ్యూనికేషన్ల శాఖలోని టెలికమ్యూనికేషన్స్ విభాగం(డీఓటీ) కార్యదర్శి, డీసీసీ చైర్మన్ డాక్టర్ నీరజ్ మిట్టల్ మాట్లాడుతూ.. భారతదేశ టెలికాం సామర్థ్యాలు, 5జీ విప్లవంలో సాధించిన విజయాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. కార్యక్రమానికి హాజరైన వారిని సీఓఏఐ చైర్మన్ శ్రీ అభిజిత్ కిశోర్ తన ప్రసంగం ద్వారా స్వాగతం పలికారు.

ఐఎంసీ-2024, డబ్ల్యూటీఎస్ఏ-2024, జీఎస్ఎస్-2024

ఆసియాలో ప్రధాన డిజిటల్ టెక్నాలజీ ప్రదర్శన అయిన 8వ ఇండియా మొబైల్ కాంగ్రెస్(ఐఎంసీ)ను టెలికమ్యూనికేషన్ల విభాగం(డీఓటీ), సెల్యూలర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఓఏఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో అక్టోబరు15 నుంచి ఈ కార్యక్రమం జరగనుంది.

ఐఎంసీ 2024తో పాటు ఏకకాలంలో భారత్ ఇదే వేదికపై ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సులైన.. వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ న్యూఢిల్లీ 2024(డబ్ల్యూటీఎస్ఏ), గ్లోబల్ స్టాండర్డ్స్ సింపోజియం(జీఎస్ఎస్ 2024)ను 2024 అక్టోబరు 14 నుంచి 24 వరకు నిర్వహించనుంది.

ఒకప్పుడు మనం కలలు గన్న సాంకేతికతలు నేడు మన నిత్యజీవితంలో చురుగ్గా భాగమైన వాటిని గుర్తుచేసే అత్యవసరమైన, ఆసక్తికరమైన కార్యక్రమాలు ఐఎంసీ 2024లో ఉంటాయి. 6జీ, కృత్రిమ మేధ(ఏఐ), సెమికండక్టర్లు, ప్రసార, ఎలక్ట్రానిక్స్ తయారీ, సాట్‌కామ్, క్వాంటమ్, భద్రత వంటి అంశాల్లో తాజా పురోగతిని పరిశీలించడానికి ఆహుతులను ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుంది. సాంకేతిక వ్యవస్థలో సరికొత్త ఆవిష్కరణలు, సేవలతో పాటు పరిశ్రమ, ప్రభుత్వ, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, ఇతర భాగస్వాముల్లో అత్యాధునిక పద్ధతుల వినియోగాన్ని ప్రదర్శించేందుకు ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2024 సరైన వేదికగా నిలుస్తుంది .

ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక ఐఎంసీ 2024లో 400 మంది ప్రదర్శకులు, 640 స్టార్టప్‌లతో పాటు అనేక సంస్థలు హాజరై తమ ఉత్పత్తులను, పరిష్కారాలను, వాటి వినియోగాలను ప్రదర్శిస్తారని అంచనా. 120కి పైగా దేశాలకు చెందిన 1,50,000 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. 900కు పైగా సాంకేతికతల వినియోగ ప్రదర్శనలు, 100కు పైగా సెషన్లు, 600 మందికి పైగా ప్రసంగాలు నిర్వహించాలనేది ఈ కార్యక్రమ లక్ష్యం. మార్గదర్శకమైన స్టార్టప్ కార్యక్రమం ద్వారా 1000 మందికి పైగా పెట్టుబడిదారులు, ఏంజెల్ ఇన్వెస్టర్లు, ఇంక్యుబేటర్లు, వెంచర్ క్యాపిటల్ ఫండ్ల ప్రతినిధులతో 500కు పైగా సమావేశాలు నిర్వహించడం ఐఎంసీ 2024 లక్ష్యం.

ఐఎంసీ 2024 యాప్

ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2024 యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో, యాపిల్ యాప్‌స్టోర్‌లో అందుబాటులో ఉంది. ఈ సులువైన యాప్ ద్వారా కార్యక్రమానికి నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. కార్యక్రమంలో ఉన్న ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకునేలా అత్యాధునిక ఏఐ సాంకేతికతతో, వినియోగదారులకు ఉపయోగపడే ఫీచర్లతో ఈ యాప్‌ను రూపొందించారు.

టెలికాం ఆవిష్కరణలు, నైపుణ్యాలు, సేవలు, తయారీ, అప్లికేషన్ల రంగాల్లో ఆదర్శవంతమైన, అత్యుత్తమ సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలకు గత మూడేళ్లుగా ప్రతియేటా ఐదు పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ టెలికాం ఎక్సెలెన్స్ అవార్డులను అందిస్తున్నారు.

ఏడాదికోసారి ఇచ్చే అవార్డులో భాగంగా శాలువా, ప్రశంసాపత్రం లేదా ఫలకతో పాటు రూ.2 లక్షల నగదు బహుమతి ఇస్తారు.

అవార్డుల కోసం అందిన 75 దరఖాస్తులను కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ పరిశీలించి గ్రహీతలను ఎంపిక చేసింది.

స్టార్టప్‌లు, ఎంఎస్ఈల కోసం పరీక్ష, రీయింబర్స్‌మెంట్ పథకం

టెలికాం రంగంలో స్టార్టప్‌లతో పాటు సూక్ష్మ, చిన్న వ్యాపార సంస్థల(ఎంఎస్ఈ)కు ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో టెలికమ్యూనికేషన్ల విభాగం(డీఓటీ) రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించింది. దేశీయ తయారీని ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఎగుమతులను పెంపొందించడం కోసం ఈ పథకాన్ని రూపొందించింది. ఉత్పత్తుల నాణ్యత, విపణిలోకి వెళ్లేందుకు తప్పనిసరి అయిన పరీక్ష, ధ్రువీకరణ కోసం అయ్యే ఖర్చులకు గానూ స్టార్టప్ లేదా ఎంఎస్ఈకి రూ.50 లక్షల వరకు ఈ పథకం ద్వారా చెల్లిస్తుంది. ఇందుకోసం మొత్తం రూ.25 కోట్ల నిధులను కేటాయించింది. పూర్తిగా ఆన్‌లైన్ పద్ధతి ద్వారా దరఖాస్తు చేసే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తం సులువుగా, దరఖాస్తులను సమర్థవంతంగా పరిశీలించేలా ఉంది. స్టార్టప్‌లు 75 శాతం, సూక్ష్మ వ్యాపార సంస్థలు 60 శాతం, చిన్న వ్యాపార సంస్థలు 50 శాతం నిధులను పొందుతాయి. ఇది టెలికాం పరిశ్రమలో నవమానమైన ఎదుగుదలకు, ఆవిష్కరణలకు మద్దతు ఇస్తున్న డీఓటీ నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.

సైబర్ సెక్యూరిటీలో సామర్థ్య నిర్మాణం కోసం ఐఐటీ జమ్ము, ఎన్‌టీఐపీఆర్ఐటీ మధ్య ఒప్పందం

టెలికమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో వృద్ధి చెందుతున్న భారత్‌లో ప్రజలు ఎలక్ట్రానిక్ సేవల వినియోగం వైపు మళ్లుతున్నారు. దీంతో సైబర్ సెక్యూరిటీ సాధనాలు, సాంకేతికను సేకరించుకోవడంతో పాటు వీటిపై పని చేయగల మానవవనరుల అవసరం కూడా పెరుగుతోంది. ఇందుకోసం డీఓటీ, ఎన్‌టీఐపీఆర్ఐటీ కలిసి సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన ప్రఖ్యాత సంస్థలు, పరిశ్రమను భాగం చేస్తూ ఒక కార్యక్రమానికి రూపకల్పన చేశాయి. ఈ రంగంలో లోతైన అవగాహన కలిగేలా నిపుణులను సిద్ధం చేసేందుకు, భారత్‌లో అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ సాధనాలు, పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు, భవిష్యత్తు కోసం సైబర్ నిపుణులను సిద్ధం చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ఈ నిపుణులు ఇంకా అనేక మందికి శిక్షణ ఇవ్వడం ద్వారా భారత్‌లో క్రమంగా సైబర్ నిపుణులు తయారవుతారు.

ఆరు నెలల పాటు హైబ్రిడ్ పద్ధతి(విద్యా ప్రాంగణం, ఆన్‌లైన్)లో శిక్షణ ఇచ్చేలా ఐఐటీ జమ్ముతో ఎన్‌టీఐపీఆర్ఐటీ ఒప్పందం చేసుకుంది. ఎంపిక చేసిన 30 మంది అధికారులతో పాటు ఈ రంగంలోని భాగస్వామ్య సంస్థల వారికి శిక్షణ ఉంటుంది.

# ఏపీలో ఆగని హత్యల పరంపర.. నడిరోడ్డుపై మరొకరి దారుణ హత్య..!

అమరావతి, జులై 20 :: ఆంధ్రప్రదేశ్‌లో హత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. అక్కడ జరుగుతున్న వరుస హత్యలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రాజకీయ కక్షలతో పట్ట పగలు, నడిరోడ్లపై అందరూ చూస్తుండగానే పరస్పరం హత్యలకు పాల్పడుతుండటంతో జనం భయకంపితులవుతున్నారు. ఇవాళ మరో వ్యక్తి పట్టపగలు నడిరోడ్డుపై దారుణ హత్యకు గురయ్యాడు.

వినుకొండలో రషీద్ హత్య ఘటనను మరువకముందే ధర్మవరం మండలం కొత్తకోటలో మరో మర్డర్ జరిగింది. వెల్దుర్తి గ్రామానికి చెందిన సూర్య నారాయణ అనే వ్యక్తిని నడిరోడ్డుపై దారుణంగా హత్య చేశారు ప్రత్యర్థులు. అయితే ఈ హత్య ఎవరు చేశారు..? ఎందుకు చేశారు..? అనే వివరాలు మాత్రం బయటికి రాలేదు.

కాగా, హత్యల్లో ఆంధ్రప్రదేశ్ బీహార్‌ను తలపిస్తున్నదని ప్రతిపక్ష వైసీపీ ఆరోపిస్తున్నది. కూటమి ప్రభుత్వం లా అండ్ ఆర్డర్‌ని గాలికి వదిలేయడంతో ఇష్టారాజ్యంగా రౌడీలు రెచ్చిపోతున్నారని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. ఏపీలో జరుగుతున్న దారుణాలకు వ్యతిరేకంగా ఈ నెల 24న ఢిల్లీలో ఆందోళనకు దిగేందుకు సిద్ధమయ్యారు. జాతీయ స్థాయిలో టీడీపీ రాజకీయ దాడులను ఎండగడతామని అంటున్నారు.

# వర్షంలో కూడా ఆగని తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం



ఖమ్మం, జులై 20: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాల నందు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల, సమావేశం ఉదయం 11గంటలకు జరిగింది. ఈ సమావేశంలో ఏఏపీసీ చైర్మన్ వి.విజయ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆమంచి సత్యనారాయణ, ఉపాధ్యాయులు జి.కమల, కే.సీత, ఎం.సతీష్, బి.సుధారాణి, ఆర్.పార్వతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఏపీసీ చైర్మన్ వప్పుల విజయ మాట్లాడుతూ...తల్లిదండ్రులు బాధ్యతతో విద్యార్థులను ఇంటి వద్ద కూడా చదివించాలని వారి ప్రవర్తనను గమనించాలని, ప్రతిరోజు తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. అలాగే టీవీలకు, సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని, ఉపాధ్యాయులు సమయస్ఫూర్తితో విద్యార్థులకు మంచి బోధన చేసి ఆరెంపుల ఉన్నత పాఠశాలకు జిల్లాలో మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. హెచ్ఎం ఆమంచి సత్యనారాయణ మాట్లాడుతూ... తల్లిదండ్రులందరూ ఇంటి వద్ద విద్యార్థులకు సమయం కేటాయించి హోంవర్క్ ను పరిశీలించాల ని, స్టడీ కార్నర్ లను కేటాయించాలని ప్రతిరోజు వారి క్లాస్ వర్క్ లను పరిశీలించాలని ఏమైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రతినెల మూడవ శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మీటింగ్ కు హాజరుకావాలని తెలిపారు.

# రూ. 7 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత నలుగురి అరెస్ట్

హైదరాబాద్, జులై 20 : రాజస్థాన్ నుంచి హైదరాబాద్ కు డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని రాజస్థాన్ కు చెందిన వ్యక్తులు, వ్యాపారవేత్తలే లక్ష్యంగా విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ శంషాబాద్, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి.. వారి నుంచి 1,250 గ్రాముల హెరాయిన్ ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.7 కోట్లు ఉంటుందని తెలిపారు.

నిందితులు నలుగురూ రాజస్థాన్ కు చెందిన వారేనని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి మీడియాకు వెల్లడించారు. హెరాయిన్ను చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి.. బస్సుల్లో తీసుకొస్తున్నట్లు చెప్పారు.

# సీనియర్ అసిస్టెంట్‌ను సన్మానించిన అడిషనల్ డీసీపీ, మినిస్ట్రీయల్ స్టాఫ్



ఖమ్మం, జులై 20 : (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా భాధ్యతలు నిర్వహిస్తున్న పి.రాము సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి పొంది బదిలీపై 6వ బెటాలియన్ (భద్రాద్రి కొత్తగూడెం) కు వెళ్తున్న నేపథ్యంలో శనివారం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్ ముఖ్యతిధిగా పాల్గొని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా 20 సంవత్సరా ల పాటు పోలీస్ శాఖలోని మినిస్ట్రీయల్ స్టాఫ్ విభాగంలో సీనియర్ సూపర్నెంట్ గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక దృక్పథం, సేవా దృష్టి, తిరుమల తిరుపతి దేవస్థానానికి ధర్మాచారిగా గత ఐదు సంవత్సరాల నుంచి పనిచేసన్తూ దైవ సేవలో ప్రతిష్టాత్మకమైనటువంటి డాక్టరేట్ పొందిన జేఎస్ కె తులసీదాన్ ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో అక్తరునీసాబేగం, సెక్షన్ సూపరిండెంట్ జానకీరాం, యాసీన్ షరిఫ్, రాజలక్ష్మి, మినిస్ట్రీయల్ స్టాఫ్ పాల్గొన్నారు.

# జూన్ త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నికర లాభం 35 శాతం వృద్ధి..!

న్యూఢిల్లీ, జులై 20 :ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికం నికర లాభాల్లో 35.33 శాతం వృద్ధి సాధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.11,951.77 కోట్ల నికర లాభం గడించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ ఏడాది రూ.16,174.75 కోట్లకు పెంచుకున్నది. అయితే 2023–24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతో పోలిస్తే 2024–25 జూన్ త్రైమాసికం నికర లాభం 2.04 శాతం తక్కువ. 2023–24 మార్చి త్రైమాసికంలో రూ.16,511.85 కోట్ల నికర లాభం సంపాదించింది హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.

బ్యాంకు మొత్తం ఆదాయం 44.77 శాతం పెరిగింది. 2023–24 ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.57,816.67 కోట్ల ఆదాయం సముపార్జించిన హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఆదాయం ఈ ఏడాది రూ.83,701.25 కోట్లకు దూసుకెళ్లింది. గతేడాది మార్చి త్రైమాసికంతో పోలిస్తే 6.62 శాతం ఆదాయం పెరిగింది. 2024–25 ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో వడ్డీ ఆదాయం 50.31 శాతం పెంచుకుని రూ.73,033.14 కోట్లకు చేరుకున్నది. మార్చి త్రైమాసికం వడ్డీ ఆదాయంతో పోలిస్తే 2.18 శాతం ఎక్కువ. బ్యాంకు స్థూల మొండి బకాయిలు జూన్ త్రైమాసికంలో 1.33 శాతానికి పెరిగాయి. గత మార్చి త్రైమాసికంలో 1.17 శాతం మాత్రమే. నికర మొండి బకాయిలు 0.3 నుంచి 0.39 శాతానికి చేరాయి.

# నాగల్ గిద్ద పోలీసు అవుట్ పోస్ట్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

## -నారాయణఖేడ్ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో రివ్యు మీటింగ్.



సంగారెడ్డి, జులై 20 : (నేటినిజం ప్రతినిధి):శుక్రవారము నాడు ఉదయం నాగల్ గిద్ద పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న పోలీసు అవుట్ పోస్ట్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన నాగల్ గిద్ద పోలీసు అవుట్ పోస్ట్ నందు విధులు నిర్వహించే సిబ్బందికి పూర్తి రక్షణతో పాటు, అన్నిరకాల వసతులు ఉండేవిధంగా ఆధునీకరించడం జరుగుతుందన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అనంతరం డియస్పి కార్యాలయం నందు సబ్-డివిజన్ పోలీసు అధికారులతో మాట్లాడుతూ సబ్–డివిజన్ పరిధిలో ఉన్నటువంటి హిస్టరీ షీటర్లు అయిన రౌడీ, కేడీలు మరియు సస్పెక్ట్ ల కదలికలను, వారి జీవన విధానాన్ని పరిశీలించాలని సూచించారు. యాక్టివ్ గా ఉన్న వారు ఎలాంటి కార్యకలాపాలు చేస్తున్నారో చెక్ చేయాలన్నారు. అలవాటుపడిన నేరస్తుల హిస్టరీ షీట్ ఓపెనింగ్ కోసం ప్రపోజల్స్ పంపాలని ఎస్.హెచ్.ఓ లకు సూచించారు.

ఇతర జిల్లా, రాష్ట్రాలతో సరిహద్దులు కలిగి ఉండటం మూలాన గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరగడానికి అవకాశం ఉన్నది కావున అధికారులు అప్రమత్తంగా ఉండి, తరచూ వెహికిల్ చెక్కింగ్స్ నిర్వహించాలని సూచించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించి, వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సంగారెడ్డి జిల్లా నార్కోటిక్ అనాల్సిస్ బ్రాంచ్ ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచడం జరుగుతుంది అన్నారు. జిల్లాలో ఎవరైన మాదక ద్రవ్యాలు తీసుకుంటునా, గంజాయి సాగు చేసినా, అక్రమ రవాణా చేసినట్లు గుర్తించినయడల సంగారెడ్డి జిల్లా నార్కోటిక్ అనాల్సిస్ బ్రాంచ్ నెంబర్ 8712656777 కు కాల్ చేసి గాని వాట్స్ ఆప్ ద్వారా గాని సమాచారం అందించవలసిందిగా సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు.ఎస్పీ ఎ.సంజీవ రావ్, నారాయణఖేడ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కంగ్టి ఇన్స్పెక్టర్ చంద్ర శేఖర్, సబ్–డివిజన్ ఎస్.ఐ.లు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర్లను పరామర్శించిన కాంగ్రెస్ నేత

## – ఆర్థికసాయం అందజేసిన పరికపల్లి



ఖమ్మం, జులై 20 : (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం పెద్దమునగాల గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు తేల్లూరి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతున్న విషయము తెలుసుకొని వారిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు, మాజీ గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్ అధైర్య పడవద్దని అండగా ఉంటానని హామీనిచ్చి కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సవళ్ల మధు, అర్జున్, కొప్పుల తిరపయ్య, మల్లయ్య, సీతయ్య, నరసింహరావు, ప్రకాష్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ నేత

## – డాక్టర్ కోట రాంబాబు



ఖమ్మం, జులై 20 : (నేటినిజం ప్రతినిధి): మధిర మండలం మాటూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కపిలవాయి సత్యనారాయణ రాజు మనుమరాలు బారసాల వేడుకకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డా.కోట రాంబాబు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్రావు, కాశీ కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు నిధులివ్వాలి

## – బీజేపీ రాష్ట్ర నాయకురాలు మాధవీలత డిమాండ్



హైదరాబాద్ జూలై 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు మాధవి లత ఆరోపించారు. అదికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ను ఇంతవరకు పునరుద్ధరించ లేదని ఆరోపించారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కు క్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో బీజేపీ ఎండో మెంట్ సెల్ ఆధ్వర్యంలో బ్రాహ్మణుల సంక్షేమంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన మాధవీ లత మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల వివేకానంద విదేశీ విద్యా పథకం పూర్తిగా కుంటుపడి పోయిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. చాలా మంది బ్రాహ్మణ విద్యార్థులు విదేశాలకు వెళ్లారని, అయితే కేవలం ఒక్క ఏడాది మాత్రమే రీయంబర్స్మెంట్ నిధులు విడుదల చేశారన్నారు. దీని వల్ల విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్ సూర్యప్రకాష్ అన్నవఝ్జుల మాట్లాడుతూ బ్రాహ్మణ పరిషత్ కు ప్రభుత్వం నిదులు కేటాయించక పోతే త్వరలో ఉద్యమ ప్రణాళికను రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ సెల్ నాయకులు నిరంజన్ దేశాయ్, నారాయణం చక్రవర్తులు, చింతపల్లి పణిభూషన్, కైలాష్, వల్లీనాద్ నాగేష్ బాబు, అర్పిత, లోకావాణి, రామసుదాకర్ శర్మ, బీజేపీ నేతలు ఎస్వీ సుభాష్, అమర్ నాథ్, గీతామూర్తి, కార్పొరేటర్ శ్రావణ్, బ్రాహ్మణ సంఘాల నాయకులు వంగపతి రావు, వెల్లాల రాంమోహన్, టీంసేనమూర్తి, దర్శనం శర్మ, నందిరాజు లక్ష్మీనారాయణ, ఎం.రాఘవరావు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పెట్టిన ప్రతి స్కీమ్‌లో స్కాం

## - రేవంత్ సర్కార్ ది ప్రజా పాలన కాదు, ప్రజా వ్యతిరేక పాలన
## -కాంగ్రెస్ సర్కార్ రైతాంగాన్ని మరోసారి మోసం చేసింది
## -రుణమాఫీ మొత్తం చేయకముందే సంబరాలు చేసుకుంటున్నారు
## -బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ జూలై 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కాంగ్రెస్ పార్టీ పెట్టిన ప్రతి స్కీమ్ లో స్కాం ఉంటుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ లోని మీడియా హాల్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ రేవంత్ సర్కార్ ది ప్రజా పాలన కాదు, ప్రజా వ్యతిరేక పాలన కాంగ్రెస్ సర్కార్ రైతాంగాన్ని మరోసారి మోసం చేసింది.రుణమాఫీ మొత్తం చేయక ముందే సంబరాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేసారు. ప్రజల సొమ్ము ఇష్టానుసారంగా చేస్తామంటే కుదరదు.రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి ఆంక్షలు పెడుతున్నారు. రుణమాఫీ కొంతమందికే చేసి మిగతా రైతులకు ఆంక్షలు పెట్టి,గత ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన విధంగానే ఇప్పుడు చేస్తున్నా రన్నారు.. రైతు పాస్ బుక్ ఆధారంగా రుణమాఫీ అని చెప్పి రేషన్ కార్డు ఆధారంగానే రుణమాఫీ చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్ నగర్, మెదక్ జిల్లాలో చాలామంది రైతులకు రుణమాఫీ కావట్లేదు. రెండు లక్షల రుణమాఫీ ప్రతీ రైతుకు కావాలి,లేనట్లయితే అసెంబ్లీ, సచివాలయం ముట్టడిస్తాం అని హెచ్చరించారు. రైతు భరోసా యసంగి పంట కు ఇవ్వలేదు, ఇప్పుడు వానాకాలం పంటకు కూడా ఎగ్గొట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందన్నారు.. రైతు రుణమాఫీ అసెంబ్లీలో చర్చించకుండానే చేశారు కదా?మరి రైతు భరోసా చెల్లింపులో అసెంబ్లీలో చర్చ దేనికో సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు.. రైతు భరోసా ఎగ్గొట్టడానికి మాత్రమే అసెంబ్లీలో చర్చ ముందుకు తెస్తున్నారు. గత ప్రభుత్వం రైతుల డాట సరిగా ఇవ్వలేదు, అప్పటి డేటా ప్రకారం పీఎం కిసాన్ సమ్మాన్ డబ్బులు కేంద్రం వేస్తోందని తెలిపారు. ఇది ఎన్నికల హామీలో లేదు, బీజేపీ ఇవ్వలేదు, ఐన రైతుల కోసం ఇస్తున్నాము, డేటా పెరిగిన కేంద్రం ఇస్తుంది. రేవంత్ సర్కార్ రైతు,విద్యార్థి, నిరుద్యోగ, ప్రజావ్యతిరేక ప్రభుత్వ మని మహేశ్వర్ రెడ్డి దుయ్యబట్టారు

# తెలంగాణ ఏర్పడి దశాబ్ధమయినా ఎక్కడి సమస్యలక్కడే..

## -రాష్ట్రంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, భూ ఆక్రమణలు
## -నీటి పారుదల ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోయాయని మండిపడ్డారు.
## -బంగారు తెలంగాణ అంటూ బానిస తెలంగాణగా మార్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం
## -టిఆర్ఎస్(డి) వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ



హైదరాబాద్ జూలై 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 10 ఏళ్ళు గడుస్తున్న ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని తెలంగాణ రక్షణ సమితి డెమోక్రటిక్–(టిఆర్ఎస్)(డి) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ ఆరోపించారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం, భూ ఆక్రమణలు, రైతుబంధు, విద్యుత్ సమస్యలు పెరిగిపోతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం బంగారు తెలంగాణ అంటూ బానిస తెలంగాణగా మార్చారని విమర్శించారు. లక్షల కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష ఎకరాలకు నీరు ఇచ్చామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ పార్టీ ఆ ప్రాజెక్ట్ ద్వారా ఒక్క ఎకరాకు కూడా నీరు అందించలేదన్నారు. నీటి పారుదల ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోయాయని మండిపడ్డారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో లక్షకోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. తాము అధికరంలోకి వచ్చిన ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిందని, అధికరంలోకి వచ్చి ఆరు నెలలకు పైగా గడుస్తున్నప్పటికీ కనీసం లక్ష ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇప్పటికే 30 లక్షలకు పైగా నిరుద్యోగులు ఉన్నారని వారికి ఉద్యోగాలు వచ్చేంతవరకు ప్రభుత్వం నిరుద్యోగ భృతికింద నెలకు రూ.3వేలు ఇవ్వలని డిమాండ్ చేశారు. త్వరలోనే తమ పార్టీ రాష్ట్రంలోని 33 జిల్లాలో పర్యటిస్తుందని, భవిష్యత్తులో తెలంగాణకు అనుకూలంగా ఉన్న పార్టీలతో టీఆర్ఎస్ కలిసి పనిచేస్తుందని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ మాలోతు విజయ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు కంచర్ల మందుశ, ఉపాధ్యక్షురాలు బోయిన ప్రత్యూష, రాయల సంధ్య, అఖిల్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారికతే ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

## -తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి రూప దేవి



హైదరాబాద్ జూలై 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం మాతృ ప్రేమతో పరిపాలన మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యంగా ఇండియన్ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ ముస్ముకేలుతుందని పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ అన్నారు. శనివారం ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ క్యాంప్ ఆఫీస్ లిబర్టీ ప్లాజా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి సమక్షంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా మునగాల రూపాదేవికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రూపా దేవి మాట్లాడుతూఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ పంచసూత్రాలైన మాతృ ప్రేమతో పరిపాలన ప్రతి మనిషికి విద్య వైద్యం ఉచితం భారతదేశం మొత్తం సంపూర్ణ మద్యపాన్నిషేధం మతసామరస్యాన్ని పాటిస్తూ గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించడం మానవసేవే మాధవసేవ ,ప్రతి కుటుంబం సుఖసంతోషాల తో జీవించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ ఆశయాలకు ఆకర్షితురాలినై ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ లో చేరినట్టు తెలిపారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలో పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ అలాగే మహిళా సాధికారతకై ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కలిగించే సమావేశలను నిర్వహించి పథకాలను సులభంగా మహిళలకు అందే విధంగా కృషి చేయనున్నట్టు తెలిపారు.

# యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మనోజ్ సోనీ రాజీనామా

హైదరాబాద్ జూలై 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మనోజ్ సోనీ రాజీనామా చేశారు.

వ్యక్తిగత కారణాలతో సోనీ రాజీనామా చేసినట్లు సమాచారం. పదవీకాలం పూర్తికాక ముందే రాష్ట్రపతి ద్రౌపతి ముర్మూకు తన రాజీనామా పత్రాన్ని ఆయన పంపారు. మనోజ్ పదవీ కాలం 2029లో ముగియాల్సి ఉండగా ఆయన ముందే రాజీనామా చేయడంతో అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మనోజ్ 2017లో యుపిఎస్ సిలో సభ్యులుగా చేరారు. 16 మే 2023న ఆయన యుపిఎస్ సి చైర్మన్‌గా నియమితులయ్యారు. మూడుసార్లు వైస్ ఛాన్సలర్‌గా సేవలదించడంతో పాటు అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు. సోనీ రాజీనామా అంశం ఐఎఎస్ పూజా ఖేద్కర్‌కు సంబంధంలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

# భారీ వర్షాలు.. ఏపీ-ఒడిశా మధ్య నిలిచిన రాకపోకలు



హైదరాబాద్, జులై 20 : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో శబరి నదితో పాటు, పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఏపీ–ఒడిశా మధ్య ఉన్న 316 జాతీయ రహదారిపై కొన్ని చోట్ల గండ్లు పడ్డాయి. చింతూరు–కల్లేరు గ్రామాల మధ్య గండ్లు పడడంతో ఏపీ, ఒడిశా మధ్య రాకపోకలు ఆగిపోయాయి.

ఇక రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పటికే ఐఎండీ ప్రకటించింది. భారీ నేపథ్యంలో, ఏపీ మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత అధికారులను అప్రమత్తం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అధికారులందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లోనూ క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

సహాయ చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సేవలు ఉపయోగించాలని అచ్చెన్నాయుడు అన్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించేలా సిబ్బంది ఎప్పుడూ కూడా సిద్దంగా ఉండాలని ఆయన తెలిపారు. వాయుగుండం కొనసాగుతున్నందున, మత్స్యకారులెవరూ సముద్రంలో వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు.

ఆహ్వానం
ఉదయ సాహితి, కరీంనగర్ జిల్లా
ఉదయ సాహితి కరీంనగర్
ప్రముఖ కవి, రచయిత, పాత్రికేయులు, ఉపాధ్యాయులు
శ్రీ శ్రీదాస్యం లక్ష్మయ్య గారి
ఉద్యోగ విరమణ సందర్భంగా
అభినందన సభ
తేది : 28.07.2024 ఆదివారం ఉ॥ 10.00 గంటలకు
వేదిక : వాగేశ్వరి డిగ్రీ కళాశాల, గీతాభవన్ వెనుక, కరీంనగర్.
సభాధ్యక్షులు : శ్రీ ఎర్రం రాజారెడ్డి గారు, అధ్యక్షులు, ఉదయసాహితి, కరీంనగర్.
ముఖ్య అతిథి : శ్రీ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ గారు, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), పెద్దపల్లి జిల్లా.
విశిష్ట అతిథి : డా॥ నలిమెల భాస్కర్ గారు, బహుభాషావేత్త
గౌరవ అతిథి : డా॥ గండ్ర లక్ష్మణరావు గారు, ప్రముఖ సాహితీవేత్త
ఆత్మీయ అతిథులు : శ్రీ దాస్యం సేనాధిపతి గారు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఉదయసాహితి, తెలంగాణ
డా॥ వైరాగ్యం ప్రభాకర్ గారు, గౌరవాధ్యక్షులు, ఉదయసాహితి, కరీంనగర్.
ప్రత్యేక అతిథి : శ్రీ నంది శ్రీనివాస్ గారు, అధ్యక్షులు, సాహితీ గౌతమి
ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీ శ్రీదాస్యం మనోహరస్వామి గారు, కరీంనగర్.
శ్రీ మంతెన శ్రీనివాసస్వామి గారు, హుస్నాబాద్.
శ్రీ నల్లవెల్లి శ్రీనివాస్ గారు, హన్మకొండ.
అభినందన సందేశాలు : వివిధ సాహితీసంస్థల ప్రతినిధులు-ఉపాధ్యాయులు-బంధుమిత్రులచే...
నిర్వహణ: మేజర్ రేళ్ల సంజీవ్ గారు, జిల్లా కార్యదర్శి, ఉదయసాహితి
శ్రీమతి వెగ్గలం ఉషఃశ్రీ గారు, సహాయ కార్యదర్శి, ఉదయసాహితి
అతిథులకు స్వాగతం : శ్రీమతి ఆది విజయలక్ష్మి శ్రీనివాస్ గారు
వందన సమర్పణ : శ్రీమతి విజయలక్ష్మి నాగరాజు గారు
అందరూ ఆహ్వానితులే.....
ఆహ్వానించువారు:
నగునూరి రాజన్న డా॥ ఎ. తిరుమల రెడ్డి ఎన్. నాగవేణి చిందం సునీత
విందు : కార్యక్రమానంతరం

